క్లుప్తంగా

సచివాలయం ఆకస్మిక తనిఖీ



నందిగామ: సచివాలయంలో పనిచేస్తున్న సిబ్బంది సమయపాలన పాటించడంతో పాటు సచివాలయానికి వచ్చిన వారితో మర్యాద పూర్వకంగా నడుచుకోవాలని కమిషనర్ డాక్టర్ జయరాం సూచించారు. పట్టణ పరిధిలోని ఐదవ నంబరు సచివాలయాన్ని బుధవారం ఆయన ఆకస్మిక తనిఖీ చేశారు. ఆ సమయంలో సచివాలయానికి వచ్చిన స్థానికులతో మాట్లాడారు. సచివాలయంలో సిబ్బంది మూవ్‌మెంట్ రిజిస్టర్, సంక్షేమ పథకాల జాబితాలను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ సచివాలయానికి వచ్చే వారితో మర్యాదపూర్వకంగా నడుచుకోవాలని సిబ్బందికి సూచించారు. విధి నిర్వహణలో అలసత్వం వహిస్తే సహించేది లేదని, సేవలందించే విషయంలో ఫిర్యాదులు వస్తే ఉపేక్షించేది లేదని హెచ్చరించారు.

బస్టాండ్‌ను తనిఖీ చేసిన ఆర్టీసీ ఎండీ



నందిగామ: పట్టణంలోని బస్టాండ్‌ను బుధవారం ఏపీఎస్ఆర్టీసీ ఎండీ ద్వారకా తిరుమలరావు ఆకస్మిక తనిఖీ చేశారు. బస్టాండ్ ఆవరణలో ఉన్న ఖాళీ ప్రదేశాలను పరిశీలించడంతో పాటు వాటి వివరాలు సేకరించారు. ముఖ్యంగా ఖాళీ స్థలాల్లో కమర్షియల్ కాంప్లెక్స్‌ల నిర్మాణం తదితర ఆదాయ వనరులకు సంబంధించిన అంశాలపై సిబ్బందితో చర్చించారు. కార్యక్రమంలో ఆయన వెంట పలు స్థాయిల ఆర్టీసీ అధికారులు బ్రహ్మానందరెడ్డి, వెంకటేశ్వరరావు, సుధాకర్, మధుసూదనరావులతో పాటు జగ్గయ్యపేట డిపో మేనేజర్ ఎంవీ ప్రసాద్, ఏసీపీ నాగేశ్వరరెడ్డి, ఎస్‌హెచ్ఓ సతీష్ తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలలకు ఫ్యాన్లు అందజేత



కొణకంచి (పెనుగంచిప్రోలు): విద్యార్థులు ఉన్నతంగా చదవాలని జెడ్పీటీసీ సభ్యురాలు పూట్ల నాగమణి అన్నారు. బుధవారం స్థానిక యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో యూపీ, జెడ్పీ హైస్కూల్‌కు గ్రామీణ ప్రాచుర్యం, సీఎస్ఆర్ కార్యక్రమంలో భాగంగా ఫ్యాన్‌లు అందజేయటంతో పాటు విద్యార్థులకు వాలీబాల్ కిట్, జామెట్రీ బాక్స్‌లు అందజేశారు. ఈ సందర్భంగా జెడ్పీటీసీ మాట్లాడుతూ విద్యా రంగానికి దాతల సేవలు కూడా మరువలేనివన్నారు. సర్పంచ్ గోసెల దేవి, మండల పరిషత్ ఉపాధ్యక్షుడు కనగాల శ్రీనివాసరావు, బ్యాంక్ డీజీఎం రజనీకాంతారావ్, ఏజీఎం పవన్‌కుమార్, అగ్రి విభాగ అధికారి ఉదయ్‌భాస్కర్, బీఎం నాగరాజు, వైఎస్సార్ సీపీ నాయకులు గింజుపల్లి శ్రీనివాసరావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

153 మందికి కంటి వైద్య పరీక్షలు



రావిరాల(జగ్గయ్యపేట అర్బన్): మండలంలోని రావిరాల గ్రామంలో రామ్‌కో సిమెంట్స్ వారు తమ సీఎస్ఆర్ యాక్టివిటీలో భాగంగా బుధవారం ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. గ్రామ సర్పంచ్ నరసింహారావు, రామ్‌కో సిమెంట్స్ డాక్టర్ రాజా కేశవప్రసాద్ శిబిరాన్ని ప్రారంభించారు. 153 మందికి డాక్టర్ ప్రవీణ్ పరీక్షలు నిర్వహించగా, వారిలో అవసరమైన 110 మందికి కళ్లజోళ్లను అందజేశారు. రామ్‌కో యాజమాన్య సిబ్బంది సీతారామరాజు, సాంబశివరావు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

దోమల నియంత్రణకు ఫాగింగ్



జగ్గయ్యపేట అర్బన్: పట్టణంలో పెరిగిపోతున్న దోమల నివారణకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు మున్సిపల్ కమిషనర్ శివకోటేశ్వరరావు తెలిపారు. ఈ సందర్భంగా బుధవారం సాయంత్రం అన్ని వార్డుల్లో దోమల నివారణకు ఫాగింగ్ చేయించారు. ఆయన మాట్లాడుతూ పట్టణంలో దోమల బెడద ఎక్కువగా ఉందని ప్రజల నుంచి వచ్చిన ఫిర్యాదులతో మున్సిపల్ చైర్మన్ రాఘవేంద్ర ఆదేశాల మేరకు అన్ని వార్డుల్లో ఫాగింగ్ చేయిస్తున్నట్లు తెలిపారు. శానిటరీ ఇన్‌స్పెక్టర్ దుర్గాప్రసాద్, మేస్త్రులు, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రశాంతంగా ప్రారంభమైన ఇంటర్ పరీక్షలు



నందిగామలోని ఓ పరీక్ష కేంద్రం వద్ద రూముల వివరాలు పరిశీలిస్తున్న విద్యార్థులు



పేట ఎస్‌జీఎస్ కళాశాల వద్ద పరీక్ష గది నంబర్లు చూసుకుంటున్న విద్యార్థులు

నందిగామ: ఇంటర్ పరీక్షలు బుధవారం ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. తొలి రోజు మొదటి సంవత్సరం విద్యార్థులకు తెలుగు/సంస్కృతం పాఠ్యాంశానికి సంబంధించి పరీక్ష నిర్వహించారు. ఈ ఏడాది నియోజకవర్గంలో ఇంటర్మీడియెట్ పరీక్షల కోసం ఏడు కేంద్రాలను ఏర్పాటుచేశారు. నందిగామ పట్టణంలో 3, కంచికచర్లలో 3, చందర్లపాడు మండలంలో 1 చొప్పున ఏర్పాటుచేశారు. ఆర్డీవో రవీంద్రరావు పట్టణంలోని చైతన్య కళాశాలలో ఏర్పాటుచేసిన సెంటర్‌ను, కంచికచర్ల మండలం కీసర సమీపంలోని బీజేటీ కళాశాలలో ఏర్పాటు చేసిన పరీక్ష కేంద్రాన్ని తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆర్డీవో మాట్లాడుతూ విద్యార్థులు ప్రశాంత వాతావరణంలో పరీక్షలు రాసేందుకు అవసరమైన అన్ని ఏర్పాట్లు చేశామన్నారు. ముఖ్యంగా ప్రతి పరీక్ష కేంద్రం వద్ద విద్యార్థులకు తాగునీరు, వెంటిలేషన్ సక్రమంగా ఉండేలా చర్యలు తీసుకున్నామన్నారు. ఆరోగ్యశాఖ సిబ్బందిని అందుబాటులో ఉంచామన్నారు. అనంతరం ఆయా కళాశాలల్లో సిబ్బందికి పలు సూచనలు చేశారు. పట్టణంలోని చైతన్య కళాశాలలో 653 మంది విద్యార్థులకు గాను 632 మంది పరీక్షకు హాజరయ్యారు. కె.వి.ఆర్ కళాశాలలో 725 మందికి గాను 700 మంది మరియనివాస్ కళాశాలలో 455 మందికి గాను 443 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. చందర్లపాడు మండలంలోని ముప్పాళ్ళ గురుకుల కళాశాలలో ఏర్పాటుచేసిన ఇంటర్ పరీక్ష కేంద్రంలో 270 మంది విద్యార్థులకు గాను 266 మంది విద్యార్థులు హాజరయ్యారు. నలుగురు విద్యార్థులు గైర్హాజరయ్యారు.

కంచికచర్లలో...

కంచికచర్ల: మండలంలో మూడు పరీక్ష కేంద్రాల్లో బుధవారం మొదటి సంవత్సరం ఇంటర్మీడియెట్ పరీక్షలు ప్రశాంతంగా జరిగాయని కస్టోడియన్ అధికారి సుజని తెలిపారు. ఉదయం 8.45 గంటలకు లోపే విద్యార్థులు పరీక్ష కేంద్రాలకు హాజరయ్యారని చెప్పారు. తెలుగు, సంస్కృతం పరీక్షలు జరిగాయని, 9 గంటలకు పరీక్షలు ప్రారంభమయ్యాయని కంచికచర్ల ప్రభుత్వ జూనియర్ కళాశాలలో 223 మంది పరీక్ష రాయాల్సి ఉండగా 204 మంది హాజరయ్యారు. స్థానిక ఇమ్మాక్యులేటివ్ డిగ్రీ కళాశాలలో 307 మందికి 294 మంది, మండలంలోని కీసర బీజేటీ డిగ్రీ కళాశాలలో 353 మందికి 345 మంది హాజరన్నారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీస్ బందోబస్తు నిర్వహించామని నందిగామ రూరల్ సర్కిల్ సీఐ ఐవీ నాగేంద్రకుమార్ తెలిపారు.



నందిగామ చైతన్య కళాశాలలో ఏర్పాటుచేసిన పరీక్ష కేంద్రాన్ని తనిఖీ చేస్తున్న ఆర్డీవో రవీంద్ర



కీసర పరీక్షా కేంద్రానికి దివ్యాంగురాలిని బైక్‌పై ఎక్కిస్తున్న హెడ్‌కానిస్టేబుల్ డేవిడ్, హోంగార్డు వెంకట్

ఆఖరి నిమిషంలో...

కంచికచర్ల: కంచికచర్లకు చెందిన ఓ దివ్యాంగురాలు ఇంటర్ పరీక్ష రాసేందుకు ఆటోలో కీసరకు తల్లితో కలసి చేరుకుంది. ఆటో డ్రైవర్ కళాశాల ప్రధాన గేట్ వద్ద దింపాడు. కాని పరీక్ష కేంద్రం చాలా దూరం ఉండటంతో గేట్ బయట ఉన్న హైవే పెట్రోలింగ్‌లో పనిచేస్తున్న హెడ్ కానిస్టేబుల్ డేవిడ్, వీరులపాడు పీఎస్‌లో హోంగార్డుగా పనిచేస్తున్న వెంకట్ తన బైక్ ద్వారా ఆ దివ్యాంగురాలిని ఆఖరి నిముషంలో పరీక్ష హాలు వద్దకు తీసుకెళ్లారు. దివ్యాంగురాలి తల్లి, ఇతర విద్యార్థుల తల్లిదండ్రులు ఆ పోలీసు చేసిన సహాయానికి అభినందనలు తెలిపారు.

జగ్గయ్యపేట అర్బన్: ఇంటర్మీడియెట్ పరీక్షలు పట్టణంలో బుధవారం ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. పట్టణంలో ఉన్న ఎస్‌జీఎస్ కళాశాల, జేఆర్సీ కళాశాల, వాగ్దేవి మహిళా కళాశాల, అమ్మాణి కళాశాల పరీక్షా కేంద్రాలకు ఉదయం 8 గంటలకే విద్యార్థులు చేరుకున్నారు. పరీక్షా కేంద్రాలకు ఒక అరగంట ముందు మాత్రమే అనుమతిస్తామని ప్రకటించటంతో తమ గదులు, నంబర్లు తెలుసుకోవటానికి విద్యార్థులు కాస్త ఆందోళనకు గురయ్యారు. ప్రథమ సంవత్సరానికి సంబంధించి మొత్తం నాలుగు పరీక్షా కేంద్రాల్లో 1,238 మంది బుధవారం హాజరు కావాల్సి ఉండగా 1,152 మంది హాజరయ్యారు. 86 మంది గైర్హాజరయ్యారు. కేంద్రాల వారీగా ఎస్‌జీఎస్ కళాశాలలో 433 మందికి గాను 31 మంది, జేఆర్సీ కళాశాలలో 206 మందికి గాను 20 మంది, వాగ్దేవి మహిళా కళాశాలలో 325 మందికి గాను 2023 మంది, అమ్మాణి కళాశాలలో 210 మందికి గాను 12 మంది గైర్హాజరయ్యారని కస్టోడియన్ శౌరీలమ్మ తెలిపారు. గురువారం ద్వితీయ సంవత్సరం విద్యార్థులు 4 సెంటర్లకు కలిపి మొత్తం 1027 మంది పరీక్షకు హాజరు కానున్నారని చెప్పారు. ఏప్రిల్ 4వ తేదీ వరకు పరీక్షలు జరుగుతాయని, పరీక్షా కేంద్రాల వద్ద 144 సెక్షన్ విధించడంతో పాటు కేంద్రాల పరిసరాల్లో జిరాక్స్ షాపులను కూడా మూసివేయించినట్లు కస్టోడియన్ వివరించారు. సీఐ అడపా నాగ మురళి ఆధ్వర్యంలో ఎస్ఐ రామారావు భద్రతాచర్యలు చేపట్టారు.



కీసర బీజేటీ డిగ్రీ కళాశాలలో విద్యార్థుల హాల్ టిక్కెట్లను పరిశీలిస్తున్న కళాశాల ప్రిన్సిపల్ ప్రకాష్

భూహక్కు భూ రక్షతో కచ్చితంగా హద్దులు

తహసీల్దార్ రాజకుమారి



కంచికచర్ల: జగనన్న శాశ్వత భూ హక్కు, భూ రక్ష పథకంలో భాగంగా భూములు రీ సర్వే చేసి, కచ్చితమైన కొలతలు, హద్దులతో సర్వే హద్దు రాళ్లను పాతుతున్నామని తహసీల్దార్ వడ్డేశ్వరపు రాజకుమారి తెలిపారు. మండలంలోని పరిటాల గ్రామంలో బుధవారం ప్రభుత్వ, ప్రయివేటు భూములను రీ సర్వే చేసి రైతులకు పట్టాలు పంపిణీ చేశారు. ఆ భూముల్లో ప్రభుత్వం పంపిణీ చేసిన సరిహద్దు రాళ్లను పాతారు. అనంతరం తహసీల్దార్ మాట్లాడుతూ రైతులు పొలానికి భూ హక్కు పత్రంతో హాజరుకావాలని కోరారు. స్టోన్ ప్లాంటేషన్ కార్యక్రమం చేపట్టే సమయంలో రైతులు పట్టాదార్ పాసుపుస్తకాలు తీసుకువచ్చి తమ సిబ్బందికి సహకరించాలన్నారు. కార్యక్రమంలో డెప్యూటీ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ సర్వేయర్ రాజేంద్ర ప్రసాద్ డీటీ నాగుల్‌మీరా, ఆర్ఐ శిరీష, సర్వేయర్ బసవరావు, వీఆర్వోలు శ్రీలక్ష్మి, వేముల ప్రదక్షిణరావు, వేల్పుల జనార్దన్, రైతులు పాల్గొన్నారు.

పోటీ పరీక్షలకు ఉచిత శిక్షణ

మొగల్రాజపురం: బ్యాంకు, స్టాఫ్ సెలక్షన్ కమిషన్, గ్రూప్స్‌తో పాటుగా వివిధ ప్రభుత్వ ఉద్యోగాలకు నిర్వహించే పోటీ పరీక్షలకు సిద్ధం అవుతున్న యువతకు విద్యాదర్శిని పేరుతో ఉచిత శిక్షణను అందజేస్తున్నామని విజన్ ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు విజయ్‌కుమార్ ప్రకటనలో తెలిపారు. పోలీసు కమిషనర్ టీకే రాణా బుధవారం నగరంలోని ఆయన కార్యాలయంలో విద్యాదర్శిని వెబ్‌సైట్‌ను ప్రారంభించారని విజయ్‌కుమార్ తెలిపారు.

17న ధ్వజ స్తంభ ప్రతిష్ఠ

నరసింహారావుపాలెం(వీరులపాడు): వీరులపాడు మండలం నరసింహారావుపాలెం గ్రామంలో ఉన్న శ్రీ కోదండ రామచంద్ర స్వామి జీర్ణోద్ధరణ జీవధ్వజ స్తంభ పునఃప్రతిష్ఠా మహోత్సవం ఈనెల 17 వ తేదీ శుక్రవారం ఉదయం 10.35 గంటలకు పరాంకుశం వాసుదేవాచార్యులు పర్యవేక్షణలో జరుగుతుందని ఆలయ అర్చకులు భరత్ కుమార్, రాజేష్‌కుమార్ తెలిపారు. దేవాలయ అవరణలో ధ్వజ స్తంభ ప్రతిష్ఠ సందర్భంగా స్వామి వారికి బుధవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ నిర్మాణానికి కృషి చేసిన ప్రవాసాంధ్రుడు, ధ్వజ స్తంభ నిర్మాణానికి సుమారు పది లక్షల రూపాయలు అందజేసిన గ్రామానికి చెందిన యేదురు విజయభాస్కర్‌రెడ్డి, అన్నపూర్ణమ్మ దంపతులను ఆలయ అర్చకులు, గ్రామస్తులు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచి బొమ్మిశెట్టి దుర్గాదేవి, కంచికచర్ల మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ బొమ్మిశెట్టి భాస్కరరావు, ఎంపీటీసీ సభ్యుడు శీలం రమణారెడ్డి, అర్చకులు వంశీ, పవన్ కుమార్, జానకిరామ్ పాల్గొన్నారు.



నరసింహారావుపాలెం గ్రామంలో పూజలు చేస్తున్న అర్చకులు

ప్రభుత్వ ఉత్తర్వులు హర్షణీయం

మైలవరం: 1998 డీఎస్సీ అభ్యర్థులకు ఉద్యోగాలిస్తున్నట్లు ప్రభుత్వం ప్రకటించడం హర్షణీయమని పీఆర్టీయూ మైలవరం శాఖ అధ్యక్ష కార్యదర్శులు పి.గోపాల్, ఎం.వెంకటేశ్ తెలిపారు. సంఘ కార్యాలయంలో బుధవారం విలేకర్లతో మాట్లాడారు. ప్రభుత్వ పాఠశాలలకు కాపలాదారులను నియమించడం అభినందనీయమని పేర్కొన్నారు. పాఠశాలల్లో ఒంటిపూట బడులు నిర్వహించాలని కోరారు. రాష్ట్ర కార్యదర్శి ఎ.పుల్లారెడ్డి, సతీష్, శేషగిరిరావు, నాగలత, శాంత పాల్గొన్నారు.

బహుజనుల రాజ్యం కోసం తపించిన కాన్షీరాం

కంచికచర్ల: బహుజనుల రాజ్యం కోసం తపించిన కాన్షీరాంను బహుజన ప్రజలు ఎన్నటికీ మర్చిపోరని బహుజన రచయితల వేదిక రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తంగిరాల సోనీ అన్నారు. స్థానిక అంబేడ్కర్ సెంటర్‌లో బీఎస్పీ వ్యవస్థాపకుడు కాన్షీరాం 89వ జయంతి బుధవారం నిర్వహించారు. ముందుగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో పిల్లి స్వామి దాసు, శేషం స్వామి, వర్మ, మనోహర్, బెజ్జం భూషణం, ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు. మండలంలోని వేములపల్లి గ్రామంలో బీఎస్పీ నాయకులు కాన్షీరాం జయంతి వేడుకలు జరుపుకొన్నారు. ముందుగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.



కంచికచర్లలో కాన్షీరాం చిత్రపటానికి నివాళులు అర్పిస్తున్న సోనీ తదితరులు

సిమెంటు రోడ్డు పనులకు భూమిపూజ

మున్సిపల్ చైర్మన్ రాఘవేంద్ర

జగ్గయ్యపేట అర్బన్: వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో రాష్ట్రంలో రహదారులన్నీ పూర్తిగా అభివృద్ధి చేస్తూ వాటి రూపురేఖలనే మార్చివేస్తోందని మున్సిపల్ చైర్మన్ రంగాపురం రాఘవేంద్ర అన్నారు. బుధవారం స్థానిక 1వ వార్డులో నూతనంగా రూ. 12 లక్షలతో చేపట్టిన సీసీ రోడ్డు నిర్మాణ పనులకు మున్సిపల్ చైర్మన్ శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎమ్మెల్యే సామినేని ఉదయభాను సూచించిన ప్రణాళిక మేరకు పట్టణంలో రోడ్లు, డ్రెయిన్ల నిర్మాణాలు చేపడుతున్నట్లు తెలిపారు. నిర్మాణ పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించాలని కంట్రాక్టర్లకు సూచించారు. మున్సిపల్ వైస్ చైర్మన్లు తుమ్మల ప్రభాకర్, హాఫీజున్నీసా ఫిరోజ్, కౌన్సిలర్లు సామినేని మనోహర్, పందుల రోశయ్య, ఖాదర్‌బాబు, మున్సిపల్ కమిషనర్ శివకోటేశ్వరరావు, పార్టీ నాయకులు పాల్గొన్నారు.



రోడ్డు శంకుస్థాపన కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ రాఘవేంద్ర, వైస్ చైర్మన్లు, కౌన్సిలర్లు

ప్రజలు సహకరిస్తే స్వచ్ఛ నందిగామ సాధ్యం

నందిగామ: పట్టణాన్ని పరిశుభ్రంగా ఉంచడంలో ప్రజలు పూర్తి సహాయ సహకారాలు అందజేయాలని, ప్రజలు సహకరిస్తే స్వచ్ఛ నందిగామ సాధ్యమని నగర పంచాయతీ కమిషనర్ డాక్టర్ జయరాం సూచించారు. పట్టణంలోని 14వ వార్డులో బుధవారం స్వచ్ఛ సంకల్పం ప్రత్యేక ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలో పారిశుద్ధ్య డ్రైవ్ నిర్వహించారు. కమిషనర్ జయరాం మాట్లాడుతూ పారిశుద్ధ్య నిర్వహణపై ప్రత్యేక దృష్టి సారించినట్లు చెప్పారు. ఇందులో భాగంగా డ్రెయిన్లలో పూడిక తీతలు, పిచ్చి మొక్కల తొలగింపు, బ్లీచింగ్ చల్లించడం, ఫాగింగ్ తదితర కార్యక్రమాలు ముమ్మరంగా నిర్వహిస్తున్నామన్నారు. కార్యక్రమంలో పలువురు సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.



పట్టణంలోని 14వ వార్డులో స్వచ్ఛ సంకల్పం ర్యాలీలో పాల్గొన్న కమిషనర్ జయరాం

బార్ అసోసియేషన్ అధ్యక్షురాలిగా పద్మశ్రీ

మైలవరం: బార్ అసోసియేషన్ నూతన కమిటీని బుధవారం ఎన్నుకున్నారు. కార్యాలయంలో బుధవారం నిర్వహించిన సమావేశంలో బార్ అసోసియేషన్ నూతన కమిటీ అధ్యక్షురాలిగా పావులూరి పద్మశ్రీ, ప్రధాన కార్యదర్శిగా బుద్దవరపు వెంకట్రావు, ఉపాధ్యక్షుడిగా ఓర్సు శ్రీనివాసరావు, సహాయ కార్యదర్శిగా బెజవాడ రాజేష్, కోశాధికారిగా పత్తిపాటి రాములను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మైలవరం బార్ అసోసియేషన్‌కు మహిళా న్యాయవాది పావులూరి పద్మశ్రీ అధ్యక్షురాలు కావడం అభినందనీయమని తోటి న్యాయవాదులు తెలిపారు. ఇప్పటి వరకు ఉన్నటువంటి బార్ అసోసియేషన్ అధ్యక్షుడు ముల్లంగి రవికుమార్ ప్రధాన కార్యదర్శి ఎం. శరత్‌బాబును న్యాయవాదులు అభినందించి, వీడ్కోలు పలికారు. కమిటీకి శరత్‌బాబు కన్వీనర్‌గా ఎన్నికయ్యారు.



మైలవరం బార్ అసోసియేషన్ నూతన కమిటీ సభ్యులు పద్మశ్రీ, వెంకట్రావు, శ్రీనివాసరావు

సినీరంగ ధ్రువతార మహానటి సావిత్రి

సావిత్రి కుమార్తె విజయచాముండేశ్వరి

విజయవాడ కల్చరల్: తెలుగు సినీరంగ ధ్రువతార మహానటి సావిత్రి అని మహానటి సావిత్రి కుమార్తె విజయచాముండేశ్వరి అన్నారు. మహానటి సావిత్రి సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో గాంధీనగర్ హనుమంతరాయ గ్రంథాలయంలో బుధవారం, సినీ నటి సావిత్రి స్ఫూర్తి సభ, సినీ సంగీత విభావరి, అంతర్జాతీయ గాయని సుధా శ్రీనివాస్‌కు ఆత్మీయ సత్కార కార్యక్రమం నిర్వహించారు. విజయచాముండేశ్వరి మాట్లాడుతూ మహానటి పేరుతో 16 సంవత్సరాలుగా అనేక కార్యక్రమాలను నిర్వహిస్తున్న సంక్షేమ సంఘం సేవలను అభినందించారు. సినీ దిగ్గజం దాసరి నారాయణరావు సావిత్రి పేరుతో కళాపీఠం స్థాపించాలని భావించారని, వారి కోరికను పరచూరి విజయలక్ష్మి సాకారం చేశారన్నారు. సావిత్రి కుమార్తెగా ఆమె అభిమానులు తనను కూడా అభిమానిస్తున్నారని, పూర్వజన్మ సుకృతంగా భావించ వచ్చన్నారు. శాతవాహనా కళాశాల కరస్పాండెంట్ నిడుమోలు రమాసత్యనారాయణ మాట్లాడారు.

గర్భిణులు, బాలింతలకు పోషకాహారాన్ని అందించాలి

మున్నలూరు(కంచికచర్ల): అంగన్‌వాడీ కేంద్రాల్లో గర్భిణులు, బాలింతలకు ఆకుకూరలు, పోషక విలువలతో కూడిన ఆహారాన్ని అందించాలని ఐసీడీఎస్ ప్రాజెక్టు డైరెక్టర్ జి.ఉమాదేవి అన్నారు. మండలంలోని మున్నలూరు, పరిటాల, కంచికచర్లలోని అంగన్‌వాడీ కేంద్రాలను బుధవారం ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆయా కేంద్రాలకు చిన్నారులు ఎంతమంది వస్తున్నారని హాజరు పట్టీని పరిశీలించారు. అనంతరం పీడీ మాట్లాడుతూ అంగన్‌వాడీ కేంద్రాల్లో ఆరుబయట ఖాళీ స్థలం ఉంటే మునగాకు చెట్లు, గోంగూర వంటి ఆకు కూరలు పండించాలని అంగన్‌వాడీ కార్యకర్తలను ఆదేశించారు. స్థలం అనుకూలంగా లేని కేంద్రాల్లో గోనె సంచులు, డబ్బాలు, బాటిళ్లు, కుండీల్లో మట్టి పోసి ఆకుకూరలను సాగుచేయాలన్నారు. చిన్నారులతో పాటు, గర్భిణీ, బాలింతలకు మెనూ ప్రకారం కోడిగుడ్లు అందించాలన్నారు. అనంతరం మున్నలూరు అంగన్‌వాడీ కేంద్రంలో సంచులు, కుండీలు, అట్టల్లో సాగుచేసిన ఆకుకూరలను చూసి సంతృప్తి వ్యక్తంచేశారు. కార్యక్రమంలో సీడీపీఓ లక్ష్మీభార్గవి, సూపర్‌వైజర్లు తారాబీ, కరీమున్నీసా, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.



మున్నలూరు అంగన్‌వాడీ కేంద్రంలో సంచుల్లో సాగు చేసిన ఆకుకూరలను పరిశీలిస్తున్న పీడీ ఉమాదేవి

అకాల వర్షాలతో అప్రమత్తంగా ఉండాలి

కేవీకే ప్రోగ్రాం కో ఆర్డినేటర్ డాక్టర్ వెంకట సుబ్బయ్య

గరికపాడు(జగ్గయ్యపేట అర్బన్): ఈనెల 16 నుంచి 21 మధ్య అకాల వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున రైతులు తమ పంటల పట్ల అప్రమత్తంగా ఉండాలని కృషి విజ్ఞాన కేంద్రం (కేవీకే) ప్రోగ్రాం కో ఆర్డినేటర్ డాక్టర్ పి.వెంకట సుబ్బయ్య, వాతావరణ విభాగం శాస్త్రవేత్త ఎం.రాజనరసింహ తెలిపారు. ఈ సందర్భంగా బుధవారం కల్లాల్లో ఉన్న మిర్చి పంటలను వారు పరిశీలించి రైతులకు పలు సూచనలు, జాగ్రత్తలు తెలియజేశారు. తెలుగు రాష్ట్రాల్లో అకాల వర్షాలు పడే అవకాశం ఉన్నట్లు వాతావరణ శాఖ ఇప్పటికే ప్రకటించిందన్నారు. ఎన్టీఆర్ జిల్లాలో వాణిజ్య పంటలైన మిర్చి ప్రస్తుతం కల్లాల్లో ఉన్నందున వర్షానికి తడవకుండా పట్టాలు కప్పుకోవాలని, పిచికారీలు, ఎరువులు వర్షం వెలిసిన తరువాత చేసుకోవాలని తెలిపారు. కోతకు వచ్చిన పంటలను రైతులు ముందే కోసుకొని సురక్షిత ప్రాంతాలకు తరలించాలని సూచించారు.

ఘనంగా కాన్షీరామ్ జయంతి

జగ్గయ్యపేట అర్బన్: బహుజన సమాజ్ పార్టీ వ్యవస్థాపకుడు, దివంగత కాన్షీరామ్ జయంతి వేడుకలు పట్టణంలో బుధవారం ఆ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి కొదమల ప్రభుదాసు ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. స్థానిక బీఎస్పీ కార్యాలయంలో జరిగిన వేడుకల్లో కాన్షీరామ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం స్థానిక ప్రభుత్వాస్పత్రిలో రోగులు, గర్భిణీలు, బాలింతలకు పాలు, పండ్లు, రొట్టెలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కొదమల ప్రభుదాసు మాట్లాడుతూ సామాజిక పరివర్తన, ఆర్థిక విముక్తి అనే నినాదంతో ఉద్యమాన్ని ప్రారంభించిన కాన్షీరామ్ ఆశయాల సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కోరారు. ఎప్పుడైతే బహుజనులకు రాజ్యాధికారం లభిస్తుందో అప్పుడే బహుజనులు అభివృద్ధి చెందుతారన్నారు. పార్టీ నియోజకవర్గ కన్వీనర్ కేవీ.రత్నం, ప్రధాన కార్యదర్శి ఆరకుంట్ల వెంకటరత్నం, నియోజకవర్గ నాయకులు కొదమల రాజశేఖర్, కె.రాహుల్, షేక్ బాషా, ప్రేమకుమార్, కె.వంశీ, శరత్‌బాబు, బి.బాబురావు పాల్గొన్నారు.



ప్రభుత్వాస్పత్రిలో రోగులకు పండ్లు, రొట్టెలు అందజేస్తున్న బీఎస్పీ నాయకులు

పెరటికోళ్లు పెరుగుదలపై ఆరా

ఇబ్రహీంపట్నం: ఇటీవల డ్వాక్రా సంఘాల మహిళలకు పంపిణీ చేసిన పెరటి కోళ్లను ఆ సంస్థ జిల్లా ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఏపీఎం శోభన్‌బాబు బుధవారం పరిశీలించారు. కేతనకొండ, మూలపాడు గ్రామాల్లోని లబ్ధిదారుల వద్ద కోళ్ల పెరుగుదలపై ఆరా తీశారు. మూడు నెలల క్రితం ఒక్కొక్క కోడి కిలో బరువు ఉండగా ప్రస్తుత 2 నుంచి 3 కిలోల బరువు పెరిగినట్లు గుర్తించారు. కోడి గుడ్లు సైజును బట్టి ఒక్కొక్కటి రూ.12 నుంచి రూ.15 వరకు విక్రయిస్తున్నారు. నాటుకోడి మాదిరిగా ఈకోళ్లకు కూడా మంచి గిరాకీ ఉన్నట్లు లబ్ధిదారులు తెలిపారు. సీసీ రామాంజమ్మ పాల్గొన్నారు.